ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 10 : పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ(టీఎస్) జిల్లా అధ్యక్షులు కన్నయ్య, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్లలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన టీచర్లకు జీతాలు ఇప్పటి వరకు రాలేదన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో టీచర్ల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే నూతన అధ్యక్షుడిగా దయానంద్, గౌరవ అధ్యక్షులుగా నర్సింహారెడ్డి, కార్యదర్శిగా శివ కుమార్, ఉపాధ్యక్షురాలుగా సంగీత, కార్యదర్శిగా అనితను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- కలెక్టరేట్‌లో నివాళులర్పించిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత చాలకి ఐలమ్మ అని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూల సమర్పించి కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్‌రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఆంజనేయులు, జిల్లా రజక సంఘం ప్రెసిడెంట్ ఎం.అజయ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తాం

- ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌అర్బన్, సెప్టెంబరు 10: సీఎం రేవంత్‌రెడ్డి తనపై పెట్టిన బాధ్యతలకు అనుగుణంగా ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రభుత్వరంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. చైర్మన్‌గా ఎంపికైన శంకర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తానన్న నమ్మకంతో ముఖ్యమంత్రి తనకు ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ బాధ్యతలను అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. తనకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఫోన్ చేసి చెప్పేవరకు తనకు ఈ విషయం తెలియదని అన్నారు. అడుగకుండానే ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, సీఎం నమ్మకాన్ని నిలబెడుతానని ఆయన తెలిపారు.

భూముల విలువ రూ.కోట్లకు పెరగడంతో రియల్ వ్యాపారులు చెరువు, కుంటలను సైతం వదలడం లేదు. మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామ పరిధిలోని అలీ చెరువును ఇష్టారాజ్యంగా ఆక్రమించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి నిర్మాణాలు సైతం చేపట్టారు. ఓ రియల్ సంస్థ చెరలో చిక్కిన ఈ చెరువు అంతకంతకూ కుచించుకుపోయి తన అస్తిత్వాన్నే కోల్పోయే ప్రమాదంలో పడింది.



కబ్జాకోరల్లో చిక్కుకున్న కాగజ్‌ఘట్ అలీ చెరువు

అలీ చెరువు ఆగమాగం!



ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలు

కబ్జాకోరల్లో కాగజ్‌ఘట్ అలీ చెరువు.. చెరబట్టిన ఓ రియల్ సంస్థ

- ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, నిర్మాణాలు
- గత ప్రభుత్వ పెద్దల సహకారంతో నిర్వాకం
- సుమారు ఎనిమిది ఎకరాలు స్వాహా
- అస్తిత్వాన్ని కోల్పోతున్న చెరువు.. పట్టని యంత్రాంగం
- ఎఫ్‌టీఎల్ హద్దుల నిర్ధారణకు కోర్టులో కేసు



ఎఫ్‌టీఎల్ పరిధిలో నింపిన మట్టి

కబ్జాల పర్వం 11

ఇబ్రహీంపట్నం/మంచాల, సెప్టెంబరు 10 : మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామ తూర్పు వైపున ఉన్న ఈ అలీ చెరువు సుమారు 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంటుంది. కాగజ్‌ఘట్‌పై భాగంలోని జాపాల రిజర్వుడు ఫారెస్టు, గడ్డమల్లాయగూడ, గున్‌గల్ రెవెన్యూ పరిధిలోని వరద కాల్వలు, కుంటల ద్వారా ఈ చెరువుకు వర్షం నీరు వచ్చి చేరుతుంది. గొలుసుకట్టుగా తదుపరి వరద ప్రవాహం నోముల, లింగంపల్లి, రాయపోల్‌ల చెరువులను కలుపుకుంటూ ముందుకు వెళ్తుంది. ఇంతటి ప్రాచుర్యం గల అలీ చెరువు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కి అస్తిత్వాన్ని కోల్పోతోంది. మొదట్లో వరద కాల్వలతో ప్రారంభమైన కబ్జాల పర్వం ఎఫ్‌టీఎల్‌ను దాటి శిఖం దాకా వచ్చింది. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే రియల్ సంస్థ వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, భవన నిర్మాణాలు ఉన్నాయి.

అంతా పథకం ప్రకారమే..

ఒక పథకం ప్రకారం ఈ వ్యవహారాలన్ని కొనసాగుతున్నా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది. అప్పటి ప్రభుత్వ పెద్దల అండతో ఈ వెంచర్‌లో కలగలిసిన ప్రభుత్వ భూమికి అనుమతి పత్రాలు అప్పట్లో సదరు వెంచర్ నిర్వాహకులకు అధికార యంత్రాంగమే ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం ఇక్కడ జరిగిన ఓ శుభ కార్యానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు హాజరు కావడంతో ఆగమేఘాలమీద సాగర్ ప్రధాన రహదారి ఆగాపల్లి నుంచి ఇక్కడకు వచ్చే ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టి రాత్రికి రాత్రే డబుల్ రోడ్డుగా మార్చారంటే స్వామి భక్తి ఏ మేరకు ఉందో తెలుసుకోవచ్చు. మొత్తంగా ఈ చెరువు సుమారు ఏడెనిమిది ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది.

కోర్టు పరిధిలో వివాదం

కాగజ్‌ఘట్ అలీ చెరువు వివాదం తాజాగా కోర్టు పరిధిలోకి వెళ్లినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాపై స్థానిక మత్స్యకారులు ఆందోళనలు చేసి సాగునీటిశాఖ, రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వెంచర్ నిర్వాహకులు స్వయంగా కోర్టును ఆశ్రయించి చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని తదుపరి ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చే తమ నిర్మాణాలను తొలగింపుకు కట్టుబడి ఉంటామంటూ విన్నవించున్నట్లు తెలిసింది. దీనిపై స్పందించిన కోర్టు వాస్తవ నివేదిక కోసం నీటి పారుదల శాఖను ఆదేశించడం జరిగిందని తెలిసింది. దీంతో నీటిపారుదల శాఖ నివేదిక కోర్టులో సమర్పించిన తదనంతరమే అలీచెరువు కబ్జాలపై తదుపరి చట్టపరమైన చర్యలు ఉండే అవకాశం ఉంది.

ఎవరినీ ఉపేక్షించేది లేదు

అలీ చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులకు సంబంధించి క్షేత్రస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

-సురేఖ, డీఈఈ, ఇబ్రహీంపట్నం



ఎఫ్‌టీఎల్‌లో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు

వెంచర్ రోడ్డుపైనా వివాదమే..

వెంచర్ కోసం ఏర్పాటు చేసి ప్రధాన రోడ్డుపైనా వివాదం నెలకొంది. ప్రధాన రహదారిపైనా వివాదమే నెలకొని ఉంది. ఈ రోడ్డును అసైన్డు భూమి సర్వే నం.22 లోనుండే వేశారు. ఈ రోడ్డు నిర్మాణంపై విమర్శలు రావడంతో అప్పట్లోనే అనేక వివాదాలు నెలకొని ఫిర్యాదులు, విచారణలు జరగాయి. చాలా కాలం పాటు రహదారి విస్తరణ పనులను స్థానికులను అడ్డుకున్నారు. అనంతరం సదరు యాజమాన్యం తమ పరపతితో ప్రభుత్వ అనుమతులు సాధించి రాత్రికి రాత్రే సీసీ రోడ్డు వేసిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వేతనాలు తక్షణమే చెల్లించాలి

- ఆస్పత్రుల్లో శానిటేషన్ కార్మికుల ఆందోళన

చేవెళ్ల, సెప్టెంబరు 10: ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యవిధాన పరిషత్ ఆరోగ్య కేంద్రంల్లో పని చేస్తున్న పేషంట్ కేర్ శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించినా ఉలుకుపలుకూ లేదన్నారు. రాష్ట్ర



చేవెళ్ల ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వ్యాప్తంగా అన్ని ఏరియా ఆసుపత్రుల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మగ్బుల్, నాయకులు కృష్ణగౌడ్, శివ, మండల మహిళ అధ్యక్షురాలు మంజుల, సభ్యులు సువర్ణ, లలిత, రమాదేవి, వెంకటమ్మ, భాగ్యమ్మ, కార్మికులు తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్సీ కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంతో భూ ఫార్మాసిటీ బాధిత రైతులు

యాచారం, సెప్టెంబరు 10 : ఫార్మాసిటీ భూ బాధిత రైతుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ కోదండరాం హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని నిలుపుకోవడంతో పాటు తమ భూములపై అన్ని హక్కులు కల్పించేందుకు సీఎంతో మాట్లాడి ఆదుకోవాలని బాధిత రైతులు బి.రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌నాయక్, వినోద్‌రెడ్డి తదితరులు మంగళవారం నగరంలో ఎమ్మెల్సీని ఆయన నివాసంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఫార్మాసిటీని తక్షణమే రద్దు చేయించాలని కోరారు. పట్టా భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా భూసేకరణ చేపట్టొద్దని కోరారు. ప్రభుత్వానికి భూమి ఇవ్వని రైతులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. దాంతో రైతుల గోడును సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేందుకు యత్నిస్తామని కోదండరాం రైతులకు హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు కొండల్‌రెడ్డి, గణేష్, దారసత్యం తదితరులు పాల్గొన్నారు.

టమాట తోటలు వర్షార్పణం

వందల ఎకరాల్లో ధ్వంసమైన పంట

- అక్కడక్కడ ఉన్నా కాయలకూ మచ్చలు
- అప్పుల్లో కూరుకుపోయిన రైతులు



చౌదర్‌పల్లిలో వర్షాలకు పాడైన టమాట తోట

యాచారం, సెప్టెంబరు 10: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా టమాట రైతులకు అప్పులే మిగిలాయి. రోజుల తరబడి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో చేతికందిన టమాట తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకొని సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం జరగడంతో లబోదిబోమంటున్నారు. ప్రకృతి విలయంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని పెట్టుబడి కూడా రాకుండా పోయిందని తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని దిక్కుతోచని స్థితిలో టమాట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అక్కడక్కడ అక్కడక్కడ కొన్ని ఎకరాల్లో టమాట తోటలున్నా కాయలకు మచ్చలు రావడంతో మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

అప్పులు తెచ్చి పెట్టుబడి

ఎకరం టమాట తోట సాగుకు దుక్కి దున్నడానికి గంటకు రూ.1,200, నాలుగు బస్తాల అడుగు పిండికి రూ.6,800, టమాట నారుకు రూ.12,800, నారు నాటడం కోసం ఐదుగురు కూలీలకు రూ.2,500, కలుపు తీయడానికి రూ.5,000, పురుగు మందులకు రూ.5,650, కాయలు తెంచడానికి రూ.2000ల వ్యయం అవుతుందని రైతు కల కొండ బీరప్ప వివరించారు. ఇంత పెట్టుబడి పెట్టి సాగు చేసినా మార్కెట్‌లో ధర లేకపోగా నేడు వర్షాల కారణంగా అప్పులు మిగిలాయని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. యాచారం మండలంలో సుమారు 350 ఎకరాల్లో టమాటను సాగు చేశారు. తరచూ కురుస్తున్న వర్షాలతో సుమారు 150 ఎకరాలకు మించి తోటలు పాడైనట్లు తెలుస్తోంది. పంటలు దెబ్బతినడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక టమాట రైతులు ఆగమాగం అవుతున్నారు.

పంటంతా పాడై.. అప్పులే మిగిలాయి



ఇటీవల కురిసిన వర్షాలకు చేతికందిన టమాట తోట పూర్తిగా పాడైపోయింది. పంట చేతికందితే మంచి ఆదాయం వచ్చేది. రెండెకరాలలో సాగు చేసిన టమాట తోటంతా దెబ్బతినడంతో అప్పులే మిగిలాయి. వర్షాలు కురవకుంటే దిగుబడి బాగా వచ్చేది. పంట పూర్తిగా దెబ్బతినడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

-వెంకటయ్య, రైతు, చౌదర్‌పల్లి

అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, సెప్టెంబరు 10: వర్షాల నేపథ్యంలో సోకే అంటు వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల ఆవరణ, ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎండీవో సరిత, మండల విద్యాధికారి మనోహర్‌లు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూర్బాగాంధీ బదిరుల ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. కిచెన్ షెడ్డు, భోజన వసతి, విద్యా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్ తీగల భార్గవి, ఆశావర్కర్ చీమల అనిత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ పరిధిలోని గురుకులాన్ని తరలించొద్దు

కొడంగల్, సెప్టెంబరు 10: ఎన్నో సంవత్సరాలుగా విద్యకు ఆమడ దూరంలో ఉన్న దౌల్తాబాద్ ప్రాంతానికి మంజూరైన గురుకుల పాఠశాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని నీటూర్ పరిధిలో మంజూరైన గురుకుల పాఠశాలను తరలించొద్దంటూ మంగళవారం కొడంగల్ కడా కార్యాలయం ముందు ఆయా గ్రామాల విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని నీటూర్, కొడీడ్, నర్సాపూర్ గ్రామాల విద్యార్థులకు విద్యాభివృద్ధికి అవకాశం వచ్చినా ఇతర ప్రాంతాలకు తరలించడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి వెనకబడిన ప్రాంతం దౌల్తాబాద్ మండలంలోనే గురుకుల పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు



కడా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కొడంగల్‌లోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. అనంతరం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించగా పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మహేశ్, రాఘవేందర్, నరేశ్, జావీద్, పరమేశ్, రవి, పాష, కృష్ణ, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, మాజీ సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన ఆకాశం



సూర్యాస్తమయం వేళ ఆకాశ ఎరుపు రంగులోకి మారి కనువిందు చేసింది. మంగళవారం సాయంత్రం 6.60గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా ఎరుపురంగులోకి మారింది. నీలి, ఎరుపు రంగుల కలయికతో ఆకాశంలో కనువిందు చేసింది. సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఈ రంగులను చూసి ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాన్ని తాండూరు మండల పరిధిలోని తాండూరు-చించోళి మార్గంలో ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- తాండూరు రూరల్, సెప్టెంబరు 10

వర్షాలతో కూలిన ఇళ్లకు పరిహారం పెంపు



బషీరాబాద్‌లో ఇటీవల వర్షానికి కూలిన ఇళ్లు

బషీరాబాద్, సెప్టెంబరు 10: వర్షాలతో కూలిన ఇళ్లకు చెల్లించే పరిహారాన్ని ప్రభుత్వం ఏట్టకేలకు పెంచుతూ సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం ధ్రువీకరించారు. వర్షాలకు ఇళ్లు పాక్షికంగా కూలిపోతే గతంలో ప్రభుత్వం రూ.3,200 పరిహారం చెల్లించేదన్నారు. ఈ పరహారాన్ని ప్రస్తుతం రూ.16,500లకు పెంచుతూ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసిందని తెలిపారు. మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు 19మంది ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సారి వర్షాలకు కూలిన ఇళ్లపై విచారణ జరిపించి, బాధిత కుటుంబాల జాబితాను ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇకపై ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలకు కొత్త జీవో ప్రకారం పరిహారం అందనుందని ఆయన వెల్లడించారు.

షిర్డీ సాయినాథుడి సేవలో స్పీకర్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 10: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మహారాష్ట్రలోని షిర్డీ సాయినాథుడి సన్నిధిలో మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. మహారాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి రాధాకృష్ణ వీకే పాటిల్‌తో కలిసి సాయినాథుడి మహా సమాధిని దర్శించుకుని హారతిలో పాల్గొన్నారు. సభాపతికి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌కుమార్‌తో పాటు ఓఎస్‌డీ పి.వెంకటేశం, సోషల్ మీడియా స్టేట్‌సెక్రటరీ రఘుపతిరెడ్డి, నాయకులు రాములు యాదవ్, అనిల్ యాదవ్‌లు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి



కాగ్నా వాగును పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మండల పరిదిలోని కోకట్ కాగ్నా వాగు వద్ద జరుగు వినాయక నిమజ్జన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. తాండూరు నుంచి కోకట్ కాగ్నా వాగు వరకు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. యువకులు మద్యం సేవించి ఉండరాదన్నారు. కోకట్ కాగ్నా వాగు వద్ద పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, సెప్టెంబరు 10 : వసతి గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా వంట గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలు, మోడల్ స్కూల్‌లోని వంట గదులను వైద్యులతో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకోవడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూరగాయలను అరగంట పాటు ఉప్పునీళ్లలో నానబెట్టి.. శుభ్రంగా కడిగి ఆరబెట్టిన తర్వాతనే వంట చేయాలని సూచించారు. డాక్టర్లు వారానికొకసారి పిల్లలను పరీక్షించి వైద్యం అందిస్తారని చెప్పారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా తమకు సమాచారం అందించాలని, ఆరోగ్య కార్యకర్తలు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్యులు వేదశ్రీ, సీహెచ్‌వో సంతోష్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం

దళిత స్త్రీ శక్తి సంఘం జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ



చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న గడ్డం ఝాన్సీ

చేవెళ్ల, సెప్టెంబరు 10 : సమాజంలో మార్పు రావాలంటే చదువే పదునైనా ఆయుధమని దళిత స్త్రీ శక్తి సంఘం జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ తెలిపారు. మంగళవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో మండలంలోని చేవెళ్ల, చన్వెల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది చదువుకోకపోవడంతోనే నిత్యం చిన్నచిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. జ్ఞానవంతులు కావాలంటే విద్యపై దృష్టి పెట్టాలన్నారు. చదువుతోనే ఆర్థికంగా నిలదొక్కుకుంటారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని సౌకర్యలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. సైకాలజిస్టు లక్ష్మి, దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్పన్‌పల్లి చెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్ హౌస్‌లు



విడ్రా ఏర్పాటయ్యేనా?

వికారాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఏర్పాటుకు పెరుగుతున్న మద్దతు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వినతి

వికారాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో జిల్లాలోనూ వికారాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (విడ్రా) ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూభాగం ఆక్రమణలకు గురైన నేపథ్యంలో హైడ్రాతరహాలో జిల్లాలోనూ విడ్రా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూ ములను ఆక్రమించుకుని ప్లాట్లు చేసి విక్రయించినా చెరువుల స్థలాల్లోనే అక్రమ నిర్మాణాలు చేపట్టినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం హైడ్రా చట్టం తీసుకువచ్చి చెరువుల సరిహద్దుల్లో అక్రమంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు చేపట్టడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేగుతున్న విషయం తెలిసిందే.

ధైర్యం చేయని అధికారులు

హైడ్రా స్వయం ప్రతిపత్తి సంస్థ ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతోంది. చెరువులు, కుంటలను ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపట్టిన వారి వెన్నులో వణుకు పుడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ అలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. చెరువుల్లో వెలసిన అక్రమ నిర్మాణాలకు కొందరు రాజకీయ నేతల అందదండలు ఉండడంతో వాటిని కూల్చేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ధైర్యం చేయలేకపోతున్నారు. హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించే విషయంలో హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుండడంతో జిల్లాలోనూ ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. చెరువులు, కుంటలను ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు హైడ్రాతరహా వ్యవస్థను జిల్లాలోనూ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల్లో కొన్ని..

వికారాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే శివసాగర్ చెరువు 180 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోనే కొత్త వెంచర్లు, నిర్మాణాలు ఏర్పాటు చేసినా అధికార యంత్రాంగం అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. వికారాబాద్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొంపల్లి చెరువు బఫర్‌జోన్ ఆక్రమణకు గురైంది. సర్పన్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే అక్రమంగా కాటేజీలు నిర్మించారు. చెరువు బఫర్‌జోన్‌ను తమ వ్యాపార అవసరాలకు రిసార్ట్‌ల యజమానులు వినియోగించుకుంటున్నా అధికార యంత్రాంగం తమకు పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. సర్పన్‌పల్లి చెరువులో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకున్న అప్పటి వికారాబాద్ తహసీల్దార్‌ను ఓ ముఖ్య రాజకీయ నేత జిల్లా శివారు మండలానికి బది లీ చేయించిన విషయం తెలిసిందే. తాండూరు పట్టణంలో చిలుక వాగు ఆక్రమణకు గురైంది. గొల్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలను వరద నీరు ముంచెత్తడంతో వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. కొడంగల్ పట్టణంలోని కొందరు కుంటస్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నా యి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే చెరువుల శిఖం భూములు ఆక్రమణలకు గురైనట్లు స్పష్టమవుతున్నా.. మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిగిలోని కొత్త చెరువు (కుంట)ఆక్రమణకు గురైంది. ప్లాట్లు చేసి విక్రయించారు. దీంతో పెద్ద ఎత్తున్న నిర్మాణాలు చేపట్టారు.

సర్వే..పదేళ్లుగా ప్రతిపాదనకే పరిమితం..

చాలా కాలంగా చెరువులు, కుంటల హద్దులు గుర్తించే ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. చెరువులు, కుంటలను ఆక్రమణల నుంచి పరిరక్షించేందుకు సర్వే చేసి తాజాగా హద్దులు ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఆ ప్రతిపాదన ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. గతంలో గుర్తించిన హద్దులకు, తాజాగా సర్వేలో గుర్తించిన హద్దులను పోలిస్తే ఏ మేర ఆక్రమణలకు గురయ్యారనేది స్పష్టత రానుంది. పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలే కాకుండా గ్రామాల్లోని చెరువులు, కుంటలు కూడా ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. ఆక్రమణలను నిరోధించేందుకు పట్టణ ప్రాంతాలతో గ్రామ స్థాయిలో విలేజ్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

చెరువుల నిర్వహణ, పర్యవేక్షణ కొరవడడంతో అభివృద్ధి పేరుతో ఆక్రమణలు పెరిగి చెరువుల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. జిల్లాలో 1182 చెరువులు ఉండగా, ఈ చెరువుల కింద 79,355 ఎకరాల ఆయకట్టు ఉంది. భూముల ధరలు పెరగడంతో పట్టణ ప్రాంతాల్లోని చెరువుల శిఖం భూముల ఆక్రమణ యధేచ్ఛగా కొనసాగుతోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ఏర్పాటుకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పట్టణ ప్రాంతాల్లోని చెరువులు ఆక్రమణలకు గురై వ్యాపారులకు కల్పతరువుగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పక్కన భూములు కొనుగోలు చేసిన బడాబాబులు, రాజకీయ నేతలు, అధికారుల అండదండలతో శిఖం భూములను ఆక్రమించుకుంటున్నారు. ఆక్రమణలను నిరోధించాల్సిన సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



వరినాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు(ఫైల్)



కంకల్‌లోని గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పూడూరు, సెప్టెంబరు 10: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో రోడ్లపై పడిన గుంతల్లో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి మంగళవారం నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఆగస్టు 27న ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదకరంగా రోడ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మంగళవారం గుంతల రోడ్లపై కంకర, మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.పూడూరు మండల కేంద్రానికి రోడ్డు, మండల కేంద్రం నుంచి మైసమ్మగడ్డ తండాకు వెళ్లే రోడ్డు, పూడూరు నుంచి మేడికొండ వెళ్లే రోడ్డు, బిజాపూర్-సోమన్‌గుర్తి మన్నెగూడ-చెన్‌గోముల్ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో ద్విచక్రవాహనాలు, బస్సులు, లారీలు, ఆటోలు వెళ్లినా ప్రమాదభరితంగా ఉండేవి. కనీసం గ్రామాల్లో రోడ్ల పరిస్థితి కూడా అదేవిధంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా కంకల్ గ్రామంలో రోడ్లపై పడిన గుంతల్లో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వరుస సంఘటనలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కనీసం తాత్కాలికంగా అయినా మరమ్మతులు చేసి కొంత ఇబ్బందులు తొలగించారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిబుల్‌ఆర్ పనులపై తుది నిర్ణయం తీసుకోలేదు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



గుడి తండా వద్ద మార్కింగ్ ఇచ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 10: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం పనుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని.. ప్రజలు, రైతులు ఆందోళన చెందవద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గేటు సమీపంలోని గుడితండాను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. తండా సమీపంలో ఇటీవల రీజినల్ రింగురోడ్డుకు మార్కింగ్ చేశారు. తమ తండా, భూములు కోల్పోతామని గిరిజన ప్రజలు, రైతులు ఆందోళన చెందుతూ ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దాంతో ఎమ్మెల్యే తండాలో పర్యటించి గిరిజనులతో కలిసి రీజినల్ రింగ్ రోడ్డుకు మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. రింగు రోడ్డు మూలంగా తమ భూములు, తండా కోల్పోయి రోడ్డున పడుతామని, తమకు అన్యాయం జరగకుండా చూడాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఎరోడ్డు నిర్మించి తమను రోడ్డు పాలు చేయవద్దని గిరిజనులు వాపోయారు. వీలైతే గుడి తండా సమీపం నుంచే రోడ్డు వెళ్లినా నివాసాలకు, ప్రజలకు నష్టం జరగకుండా చూస్తానని, అధైర్య పడవద్దని కసిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. నాయకులు విజయ్‌రాథోడ్, తావు, చంద్రు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



శిక్షణలో పాల్గొన్న వివిధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు

కడ్తాల్, సెప్టెంబరు 10: ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని స్కూల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్ ప్రొఫెసర్ ఎస్.ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతలపై విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని దిఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగిసింది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ప్రొ.ఉపేందర్ రెడ్డి, ఐఎఫ్ఎస్ మోహన్ చంద్ర పర్గేన్, ప్రఖ్యాత పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. సాయిభాస్కర్‌రెడ్డి, పర్యావరణ ఉద్యమకారులు సురేశ్ గుప్తా, ప్రొఫెసర్ హరిసర్వోత్తమన్, డీఎస్వోలు దేవరాజు, శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమానికి రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకత, నీటి పొదుపు, జీవరాశుల పరిరక్షణ గురించి వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం లీలాలక్ష్మారెడ్డి చేతుల మీదుగా వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సీజీఆర్ సంస్థ సభ్యులు, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీజీఆర్ కో-ఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఐఈసీ స్పెషలిస్టు అన్నమయ్య, అడ్మిన్ ఆఫీసర్ అనుదీప్, ప్రోగ్రామ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మదర్సా నిర్మాణ పనులు నిలిపివేత



నిర్మాణ పనులను అడ్డుకున్న ఇరిగేషన్ ఏఈఈ మాధురీలత

పెద్దేముల్, సెప్టెంబరు 10: కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్ స్థలాన్ని ఆక్రమించుకుని మదర్సా నిర్మాణం పనులు చేపట్టారని ఇరిగేషన్ అధికారులు పనులు నిలిపివేశారు. మండలంలోని మంబాపూర్ గ్రామసమీపంలో మదర్సా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణం కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువ స్థలాన్ని ఆక్రమించి కడుతున్నారని గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ ఏఈఈ మాదురీలత గ్రామాన్ని సందర్శించి మదర్సా నిర్మాణ పనులను పరిశీలించారు. కొలతలు చూసి ఇది కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌కు సంబంధించిన స్థలమని స్పష్టం చేశారు. ఇక్కడ పనులు చేపట్టరాదని నిర్మాణదారులకు సూచించారు. ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది ముమ్మాటికి ఇరిగేషన్ స్థలమని, దానిని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారని అన్నారు. అంతేకాకుండా నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు. అనుమతుల విషయమై నిర్మాణదారులను ఏఈఈ కోరగా తమవద్ద అనుమతులు ఉన్నాయని చెప్పారని, అనుమతులు ఉంటే నిర్మాణానికి సంబంధించిన పత్రాలు వికారాబాద్ కార్యాలయానికి తీసుకొచ్చి చూపించాలని చెప్పామన్నారు. అన్నీ పరిశీలించాక ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయని ఏఈఈ వెల్లడించారు.

వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలి

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కరన్‌కోట్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఆకస్మిక తనిఖీ



కరన్‌కోట్ జడ్పీహెచ్‌ఎస్‌లో వంట సరుకులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

తాండూరు రూరల్, సెప్టెంబరు 10: పాఠశాలల్లో వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కరన్‌కోట్ జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ పాఠశాలలో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం సబ్‌కలెక్టర్ సాంఘిక శాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశంలోని భూమి ఆకర్షణశక్తి, గ్రావిటీ గురించి విద్యార్థులకు బోధించారు. బోధనా అంశాలపై హెచ్‌ఎం రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వంట గది పరిశుభ్రంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వహకులను ఆదేశించారు. వంట నూనె ప్యాకెట్లు, ఇతర సరుకులను ఆయన పరిశీలించారు. పాఠశాల నిర్వహణ కోసం బాలమణి అనే మహిళలను స్కావెంజర్‌గా నియమించినట్లు పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి మండల పంచాయతీ అధికారి ఆనంద్‌రావు సబ్ కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీ నుంచి మహిళలను నియమించినా ఎందుకు పని చేయించుకోవడం లేదని, పనులు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారి ఆనంద్‌రావు, తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం : ఎంపీలు ఈటల, కొండా



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

శంషాబాద్, సెప్టెంబర్ 10 : దేశాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా శ్రేయస్సే ప్రధానంగా సాగుతున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెడల ల క్ష్మీనారాయణలు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ బీజేపీలో చేరేందుకు 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకోండి, దేశ ప్రగతిలో భాగస్వామ్యమవ్వండని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు బూత్‌స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కట్టా వెంకటేశ్, డాక్టర్ ప్రేంరాజ్, టి.అంజన్‌కుమార్, పోరెడ్డి నర్సింహారెడ్డి, జోసుపల్లి ప్రతాప్, కేఎస్ రత్నం, లచ్చిరెడ్డి, శ్రీరాములు యాదవ్, కడారి జంగయ్యయాదవ్, ప్రభాకర్, ప్రకాష్, బుక్కా వేణుగోపాల్, శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, తదితరులున్నారు.

గౌడ కులస్థులందరూ ఐక్యంగా ఉండాలి



మొయినాబాద్ రూరల్ : మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన గౌడ సంఘం నాయకులు

మొయినాబాద్‌రూరల్ /ఆమనగల్లు/శంషాబాద్, సెప్టెంబరు 10: గౌడ కులస్థుందరూ ఐక్యంగా ఉండి పనిచేస్తే ఏ పార్టీలో ఉన్నా పదవులు వరిస్తాయని నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. నూతన పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించిన సందర్భంగా మొయినాబాద్ గౌడ సంఘం నాయకులు మంగళవారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహగౌడ్, మండలాధ్యక్షుడు అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఎల్లని నవీన్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు. అదేవిధంగా మహేశ్ కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకుడు జెల్ల రమేశ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల, శాలువాలతో సత్కరించి అభినందించారు. అలాగే మహేష్‌కుమార్ గౌడ్‌ను శంషాబాద్‌కు చెందిన పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ శంషాబాద్ మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, కార్యకర్తలు ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

చేవెళ్ల, సెప్టెంబరు 10 : రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామం పరిధిలో నిరుపయోగంగా ఉన్న ఓ పశువుల కొట్టంలో పెద్దఎత్తున అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అక్రమార్కులు నగర శివార్లలోని నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుని పెద్దఎత్తున బియ్యాన్ని నిల్వ చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు. పౌర సరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ బృందంతోపాటు డీటీ హనమా రవీందర్‌నాయక్ స్వాధీనం చేసుకున్న బియ్యానికి పంచనామా చేసినట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

- ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు
- చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 10: భూమి కోసం.. భుక్తి కోసం... పేదల హక్కుల సాధనకు చాకలి ఐలమ్మ సాయుధ పోరాటం చేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని షాద్‌నగర్‌లోని ఆమె విగ్రహానికి మంగళవారం ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని శంకర్ తెలిపారు. రజక సంఘం తాలుకా అధ్యక్షుడు విఠ్యాల పెంటయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నందిగామ రాంచందర్, లింగారెడ్డిగూడ అశోక్, నందిగామ శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబర్‌ఖాన్, జగదీశ్వరప్ప, కృష్ణారెడ్డి, కె. పురుషోత్తంరెడ్డి, అగీరు రవికుమార్, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, మహనీయుల విగ్రహాలను నెలకొల్పి స్మరించుకుంటామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో నెలకొల్పనున్న రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి, పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, బూర్గుల రామకృష్ణారావు, గద్దర్ విగ్రహాల ఏర్పాటు కోసం మంగళవారం స్థల పరిశీలన చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మండల పరిషత్ ఎదురుగానే వారి విగ్రహాలు నెలకొల్పుతున్నట్లు తెలిపారు.

చేవెళ్ల : తెలంగాణ సాయుధ పోరాట ధీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మలి విడత తెలంగాణ ప్రత్యేక ఉద్యమం సాగి విజయం సాధించామని, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలో చేవెళ్ల రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహం వద్ద ఎమ్మెల్యే వివిధ పార్టీల నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు సున్నపు వసంతం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఅగిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, మాజీ సర్పంచ్‌లు రమేశ్ గౌడ్, నర్సింలు, మండల మహిళా అధ్యక్షురాలు సమతారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, బీజేపీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా యూత్ నాయకులు వైభవ్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్‌లు యాదయ్య, శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, చేవెళ్ల రజక సంఘం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, రజక సంఘం జేఏసీ జిల్లా చైర్మన్ శర్వలింగం, రజక సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ జె.మల్లేశ్, జిల్లా రజక సంఘం నాయకులు జంగయ్య, రాజేశ్, శ్రీనివాస్, అనంతయ్య, శ్రీనివాస్, పాండు, వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు హరికృష్ణ, పార్టీలు, సంఘాల నాయకులున్నారు.



కడ్తాల : ఐలమ్మ వర్ధంతిలో పాల్గొన్న వెంకటేశ్, దశరథ్ నాయక్, జీఎల్ఎన్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్ : ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌లు పిలుపునిచ్చారు. ఐలమ్మ రజక సంఘం మండలాధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు మంగళపల్లి నర్సింహ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : పట్టణంలో రజక సంఘం, మండల పరిషత్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో రజక సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీడీవో కుసుమ మాధురి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో మాధవరెడ్డి, రజక సంఘం నాయకులు నాగిళ్ల బుచ్చయ్య, జగన్, తిరుపతయ్య, మద్దూరి అయోధ్య, తదితరులు పాల్గొన్నారు.,

తలకొండపల్లి : మండల కేంద్రంతోపాటు గట్టిప్పలపల్లిలో ఐలమ్మ వర్ధంతిని పార్టీల నాయకులు, రజక సంఘం నేతలు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దుబ్బచెన్నయ్య, దశరథం, సాయిలు, బిక్షపతి, చెన్నయ్య, రేణురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్య, రాజు, పవన్‌వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : చాకలి ఐలమ్మ వీరవనిత అని మాజీ జడ్పీటీసీ రవితేజ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇర్విన్‌లోని బస్టాండ్‌వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డు శంకర్, బొడ్డు యాదయ్య, పగడాల కొండయ్య, పగడాల నరేష్, డాక్టర్ వెంకటేష్, ఎరుకలి శివ, గుండె వెంకటేష్, హరీష్‌రెడ్డి, శ్రీనులున్నారు.

కందుకూరు : భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం మరుపురానిదని రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర నాయకులు బొమ్మరాజు మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమరాజు వెంకటేష్‌లు అన్నారు. ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు అక్కనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు నేదునూరులో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చిప్పలపల్లి మాజీ సర్పంచ్ బాలకృష్ణ, ఆ సంఘం మండల నాయకులు కిషన్, కె.సురేందర్, పి.కృష్ణ, కె.నర్సింహ, జి.నరేష్, ఆర్ గణేష్, ఎస్.బాల్‌రాజు, బాలక్రిష్ణ, రమేష్, ఎం.శ్రీకాంత్, టి.అంజయ్య, నాయకులు తదితరులున్నారు.



షాద్‌నగర్ అర్బన్ : చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఐలమ్మ వర్ధంతిని జరుపుకున్నారు. సిద్ధాంతి బస్తీ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి శంషాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ ఆయిల్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు రజక సంఘం నాయకులు పాలొన్నారు.

షాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన అమరజీవి చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు తమ్మలి రవీందర్, అస్మత్‌పాష, రాము, రాహుల్‌గుప్తా, అశోక్, రమేష్, నర్సింహులు, కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : పెద్దతూప్రలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.నర్సింహ, డైరెక్టర్ గౌతమ్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్.అశోక్, అంజయ్య, డి. అంజయ్య, నారాయణ, పోచయ్య, కుమార్‌స్వామి, నారాయణ, విద్యాచరణ్, శేఖర్, అజం, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : నాయకులు, రజకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థాన చైర్మన్ చేవెళ్ల కృష్ణయ్య, కె.శ్రీనివాస్, సుబ్బయ్యగౌడ్, రాజేందర్‌గౌడ్, రజకులు రాయికంటి రామస్వామి, చేవెళ్ల శ్రీనివాస్, రాయికంటి గోపాల్, శివలింగం, మహేష్, ప్రవీణ్, ఉప్పన్నోళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : ఐల్లమ్మ ఉద్యమ స్ఫూర్తితో రజకుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లా రజక సంఘం అధ్యక్షులు అజయ్ చెప్పారు. మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహానికి రజక సంఘ నాయకులు నివాళులర్పించారు. నాయకులు దశరథ, భూషణ్, బచ్చయ్య, యాదయ్య, బి.రాజు, శ్రీహరి, దేవలయ్యలున్నారు.

మంచాల : సీపీఎం నేతలు మంచాల చెర్వుకట్టపై గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు పోచమోని కృష్ణ, నేతలు ఆవుల యాదయ్య, కాళ్ల జంగయ్య, గడ్డం శంకర్, రాములు, ఒగ్గు ప్రభాకర్, గడ్డం సంజీవ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఐలమ్మ వర్ధంతిని ఇబ్రహీంపట్నంలో సీపీఎం నేతలు జరుపుకున్నారు. ఆమె విగ్రహం వద్ద నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సామ్యేల్, సీహెచ్.జంగయ్య, వెంకటేష్, నర్సింహ, బుగ్గరాములు, బి.యాదగిరి, మునిలయ్య, మస్కుచరణ్, పి.కృష్ణ తదితరులున్నారు.



చేవెళ్ల : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

మొయినాబాద్ రూరల్ : మహిళాశక్తికి ప్రతీక ఐలమ్మ అని నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు చాకలి మల్లేష్ అన్నారు. మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రఘు, నవీన్, మల్లేష్, శ్రీనివాస్, మహేందర్, మల్లేష్‌గౌడ్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

సంపులో పడి బాలుడి మృతి

ఆమనగల్లు, సెప్టెంబరు 10: నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన దుడ్డు శేఖర్ కుమారుడు అభిరామ్(2) సోదరితో కలిసి సోమవారం సాయంత్రం ఇంటిబయట ఆడుకుంటున్నాడు. అభిరామ్ తల్లి, సోదరుడు ఇంట్లో ఉన్నారు. కొంతసేపటి తర్వాత బయట ఆడుకుంటున్న కూతురు ఏడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చింది. అభిరామ్ రాకపోవడం, చుట్టుపక్కల వెతికినా కన్పించకపోవడంతో అనుమానం కలిగిన కుటుంబ సభ్యులు ఇంటి ముందు సంపు వద్దకు వెళ్లి చూడగా కన్పించాడు. అపస్మారక స్థితిలో ఉన్న అభిరామ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైదరాబాద్‌లోని హస్తినాపూర్‌లో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, ఆ తర్వాత నిలోఫర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున బాలుడు మృతిచెందాడు. బాలుడి తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడలు కాపురానికి రావడం లేదని..

ఉరేసుకొని అత్త ఆత్మహత్య

చేవెళ్ల, సెప్టెంబరు 10 : ఆరు నెలలుగా కోడలు కాపురానికి రావడం లేదని బాధతో అత్త తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మొకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపి వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం టంగటూర్‌కు చెందిన మాణెమ్మ (55) కుమారుడు ఉమాకాంత్‌కు నాలుగేళ్ల క్రితం లావణ్య అనే మహిళతో వివాహం జరిపించారు. కొంతకాలం వారి సంసారం సాఫీగా సాగింది. ఆరు నెలల క్రితం కోడలు లావణ్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం కాపురానికి రావాలని పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. దాంతో కోడలు కాపురానికి రావడం లేదని అత్త మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదుతో పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.45 వేలు అపహరణ

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

చేవెళ్ల, సెప్టెంబరు 10 : ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళ వద్ద నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.45 వేల నగదు దొంగిలించిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. షాబాద్ మండల పరిధి రుద్రారంనకు చెందిన కావలి సావిత్రి తన బంధువు మాధవితో కలిసి చేవెళ్ల మండల కేంద్రంలోని గొల్కొండ గ్రామీణ బ్యాంకుకు వచ్చారు. గోల్డ్‌లోన్‌ను చెల్లిద్దామని సావిత్రి రూ.45వేలు తీసుకొచ్చింది. అధికారులు బ్యాంకులో గోల్డ్ అప్రైజర్ అందుబాటులో లేడని మరునాడు రావాలని సూచించారు. దాంతో ఆమె రూ.45 వేలు బ్యాంకులో డిపాజిట్ చేకుండానే ఇంటికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమైంది. సావిత్రి, మాధవిలు చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె వద్ద ఉన్న బ్యాగు నుంచి డబ్బు దొంగిలించారు. ఇంటికి వెళ్లిన తర్వాత డబ్బులు కన్పించకపోవడంతో చేవెళ్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని రోడ్డుపై హంగామా

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 10 : మద్యం మత్తులో ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని వీరంగం సృష్టించాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండుపల్లి వద్ద ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లికి చెందిన శివ అనే యువకుడి బైక్‌పై వెళుతుండగా పోలీసులు ఆపి బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా.. రీడింగ్ 157 పాయింట్లు వచ్చినట్లు గుర్తించారు. దాంతో బైక్‌ను స్వాధీనం చేసుకోగా ఆ యువకుడు పోలీసులపై దాడికి యత్నించాడు. తన బైక్‌ను ఇవ్వాల్సిందిగా గొడవపడ్డాడు. అయితే, కొద్దిసేపు అక్కడి నుంచి కనిపించకుండా వెళ్లిన అతడు.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని పోలీసుల వద్దకు వచ్చాడు. బైక్ ఇవ్వకుంటే చనిపోతానంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో ఆ యువకుడు అగ్గిపెట్టెతో నిప్పంటించుకున్నాడు. పోలీసులు అతడిని నిలువరించి ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడంతో చికిత్స పొందుతున్నాడు. గతంలో మైలార్‌దేవ్‌పల్లి స్టేషన్‌లో శివపై కేసు నమోదైనట్లు సీఐ నరేందర్‌రెడ్డి చెప్పారు.

కోదండరెడ్డికి నాయకుల శుభాకాంక్షలు



మంచాల : కోదండ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రసన్నకుమార్ శర్మ, ముచ్చర్ల వెంకటేష్ యాదవ్

మంచాల/యాచారం, సెప్టెంబరు 10 : మంచా ల మండలానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నేతలు ప్రసన్నకుమార్‌శర్మ, ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్‌లు మంగళవారం తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దెంది రాంరెడ్డి, యాదయ్యగౌడ్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ పదవికి వంద శాతం న్యాయంచేసి రైతుల కడగండ్లు తీరుస్తానని కోదండరెడ్డి వెల్లడించారు. యాచారం మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు దెంది రాంరెడ్డి, సుధీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్వేతారెడ్డి మృతికి కసిరెడ్డి సంతాపం

ఆమనగల్లు, సెప్టెంబరు 10: మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే చర్లకోల లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మృతి పట్ల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆవంచ గ్రామంలో మంగళవారం శ్వేతా రెడ్డి మృత దేహాన్ని కసిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామ మాజీ సర్పంచ్ రఘుపతి తండ్రి లక్ష్మయ్యమృతి పట్ల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు రఘురాములు, డేవిడ్, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చెన్నకేశవులు, తదితదరులు ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



కొత్తూర్ : ఇన్ముల్‌నర్వలో భక్తుల పూజలు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మహేశ్వరం/మొయినాబాద్ రూరల్/షాబాద్/కొత్తూర్/కేశంపేట : సెప్టెంబరు 10: వినాయక నవరాత్రోత్సవాలు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని నవ చైతన్య కాలనీ బుద్దినాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి లు హాజరై పూజలు నిర్వహించారు. కడ్తాల మండల కేంద్రంతో పాటు మైసిగండి గ్రామంలో గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా జరుగుతున్న వినాయక నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మధుమోహన్ తెలిపారు. నిమజ్జనానికి సంబంధించి రావిర్యాల, తుక్కుగూడ, మంఖాల్ తదితర ప్రాంతాల్లోని చెరువులను అధికారులతో కలిసి పరిశీలించారు. తుక్కుగూడలో సూరం చెరువు వద్ద నిమజ్జనానికి భారీ క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు కావాల్సిన లైటింగ్ సిస్టం, శానిటేషన్ తదితర సదుపాయాలను కల్పిస్తున్నామని, రావిర్యాల పెద్ద చెరువు వద్ద కూడా ఏర్పాట్లు చేశామన్నారు. కేసీ తండాలో నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన వారిలో తుక్కుగూడ కమిషనర్ వెంకట్‌రామ్, ఎంపీడీవో శైలజారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే నవరాత్రి ఉత్సవాలు మొయినాబాద్ మండలంతో పాటు గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, సంఘాల నాయకులు పూజలు నిర్వహించారు. అజీజ్‌నగర్‌లో నిర్వహించిన పూజల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి, బీజేపీ నాయకుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో గోల్డ్‌ఫేస్ కాలనీలో లడ్డూను వేలం వేయగా కండక్టర్ బాల్‌రాజ్ రూ.99,999 వేలకు దక్కించుకున్నాడు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలో వినాయకుని ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రత్యేక పూజలతో పాటు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండపాలను విద్యుత్ దీపాలంకరణతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. కేశంపేట మండల కేంద్రంలో విశ్వకర్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద రొల్లు వెంకటేష్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందుకు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ యూత్ సభ్యులతోపాటు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మహేశ్వరం : రావిర్యాల చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న మధుమోహన్, అధికారులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చౌదరిగూడ, సెప్టెంబరు 10: విజయ డెయిరీలో పెండింగ్‌లో ఉన్న పెడింగ్ బిల్లులు చెల్లించాలాంటూ జీఎం మల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి చెందిన విజయ డెయిరీ పాల సేకరణ నిర్వాహకులు హైదరాబాద్‌లో విజయ డెయిరీ జీఎంను కలిశారు. గత రెండు నెలలుగా, నాలుగు బిల్లులు డెయిరీ బల్లులు పెడింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విజయ డెయిరీ స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. అయితే ఇందుకు స్పందించిన జీఎం రెండు రోజులలో ఒక బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, రాము, వెంకటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : బాధిత కుటుంబాలకు అన్ని విదాల అండగా ఉంటానని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రాజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన యాదమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు అందించారు.

తలకొండపల్లి : భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువు కుంటలను, పాడైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమత్తు చేయిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎవరు అధైర్య పడవద్దని కోరారు. దేవునిపడకల్ గ్రామ నాయకులు ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయిన చెరువు,కుంటలు, చెక్ డ్యామ్ లను, ఫీడర్ ఛానళ్లను మరమ్మతులు చేసి ఆధునీకరించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ జోగు రమేశ్‌లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం యాదవ్, ఐలేశ్, తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ రూరల్ : పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు హైకోర్టు చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చిందని బీఆర్ఎస్ మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుమీద గెలిచి, మరొక పార్టీలోకి వెళ్లడమంటే.. నమ్మిన ఓటర్లను మోసం చేయడమేనని, కోర్టులు కూడా స్పష్టం చేశాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి నైతికత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని నర్సింహగౌడ్ డిమాండ్ చేశారు.

కొత్తూర్ : కొత్తూర్ ప్రధాన రహదారిలో డబ్బాలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా బీసా సాయిబాబా ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకొని పలువురు నిరుపేదలు కొన్నేళ్ల క్రితం డబ్బాలు వేసుకుని వివిధ వ్యాపారులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రహదారి విస్తరణలో భాగంగా సంబంధిత శాఖ అధికారులు డబ్బాలను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. నెలరోజులుగా చిరువ్యాపారులు వ్యాపారాలు లేక పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే వీర్లపలిత్ల శంకర్, అర్అండ్‌బీ అధికారులతో సమావేశమై చిరువ్యాపారులకు న్యాయం చేయాలని సాయిబాబా కోరారు.

షాద్‌నగర్ రూరల్ : గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని రాయికల్ టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ప్రాథమిక పాఠశాలకు టోల్ ప్లాజా తరఫున కంప్యూటర్, ప్రొజెక్టర్, ప్రింటర్ బహూకరించారు. హెచ్ఎం కృష్ణయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ యశోద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : వేముల్‌నర్వ, దత్తయాపల్లి, పాపిరెడ్డిగూడ, తూర్పు గడ్డ తండా, ఇప్పలపల్లిలోని పోలింగ్ స్టేషన్లను మండల ప్రత్యేకాధికారి రాజారత్నం ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్యలతో కలిసి పరిశీలించారు. కొత్తపేట వసతి గృహాన్ని సందర్శించారు.

షాద్‌నగర్ రూరల్ : గణేష్, మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రశాంత వాతావణంలో జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. బొబ్బిలి చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : మండల కేంద్రానికి చెందిన కొంద్రు వంశీబాబుకు ఉస్మానియా యూనివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగంలో డాక్టరేట్ పట్టా పొందాడు. కోల్ ఆఫ్ అల్కలీ మెటలాక్సైడ్ ఆన్ స్ట్రక్చర్ డిపెండెంట్ ప్రాపర్టీస్ ఆఫ్ బోటెల్యూరైట్ గ్లాసెస్ అనే అంశంపై పరిశోధన చేశారు.

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయ స్లాబ్ నిర్మాణం పనులను చేపట్టారు. కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీపాల్, మాజీఎంపీపీ ధనుంజయ్య, నాయకులున్నారు.

యాచారం : చదువుతో పాటు ఆటల్లో రాణించాలని, ఆటలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొదిస్తాయని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆడితే మానసికంగా, శారీరకంగా దృఢత్వం ఉంటుందన్నారు. గెలుపు ఓటములు సహజమని ఓడామని బాధపడకుండ మరో సారి ఆడితే విజయం మీదేననే విషయం గమనంలో పెట్టుకొని ఆడాలన్నారు. యువత, విద్యార్థులు స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, ఉపాధ్యాయులు, పీడీలు తదితరులున్నారు.

గుంత.. తీరెను చింత

- రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను పూడ్చిన అధికారులు, నాయకులు



రోడ్డు మధ్యలో గుంత, పూడ్చుతున్న అధికారులు, నాయకులు

కొందుర్గు, సెప్టెంబర్, 10: పంచాయితీ కార్యదర్శి, పోలీసులు, అధికార పార్టీ నాయకులు మనసుంటే మార్గముంటుందని నిరూపించారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన గుంతను మంగళవారం పూడ్చివేయించారు. కొందుర్గు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ వెళ్లే బీటీ రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడడంతో, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో వర్షం కురిస్తే చాలు మొత్తం పైనుంచి కిందికి వస్తుంటుంది. దాంతో రోడ్డు మధ్యలో చిన్న గుంత ఏర్పడింది. ఈ గుంతను పూడ్చకపోవడంతో ఆ గుంత కాస్త పెద్దగా మారింది. తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో మంగళవారం ఉదయం కార్యదర్శి బాబయ్య, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనయ్య, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు చేవెళ్ల కృష్ణయ్య, రాయికంటి రామస్వామిలు కలిసి ఐరన్ పరిశ్రమ సిబ్బందితో మాట్లాడి ఐరన్ మట్టిని తెప్పించి, రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల్లో పోయించారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

తలకొండపల్లి, సెప్టెంబరు 10: అంతారంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కామినేని ఆసుపత్రి సహకారంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉప్పల అఖిల్, అనిల్, కామినేని ఆసుపత్రి వైద్య సిబ్బంది 189 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నాయకులు వెంకటయ్య, రాములు, రహెమాన్, తదితరులున్నారు.

కళాశాల భవన నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 10: షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణం కోసం ఎంఎస్ఆర్ సేవా సంస్థల అధినేత మండడి నరేందర్‌రెడ్డి రూ. ఐదు లక్షలు విరాళంగా ప్రకటించారు. దాతల సహకారంతో అన్ని సౌకర్యాలతో పాటు కళాశాల భవనాన్ని నిర్మించతలపెట్టినట్టు ఎమ్మెల్యే శంకర్ ఫోన్‌చేసి చెప్పడంతో విరాళం ఇవ్వబోతున్నట్టు తెలిపారు.